క్లుప్తంగా

సిల్వర్ ఓక్స్ స్కూల్‌లో ‘ఆర్ట్ ఆఫ్ గివింగ్’

దుండిగల్: బాచుపల్లిలోని సిల్వర్ ఓక్స్ స్కూల్ ఆవరణలో ఆదివారం ‘సిల్వర్ ఓక్స్ స్ట్రీట్ స్టోర్’పేరిట చారిటబుల్ పాపప్ ఈవెంట్‌ను నిర్వహించారు. విద్యార్థులు తాము ఉపయోగించని అనవసరమైన వస్తువులు, పుస్తకాలు, బొమ్మలు, బట్టలు, స్కూల్ బ్యాగులు, బూట్లు తదితర వస్తువులను సేకరించి ఈ స్టోర్ లో నిరుపేదల కోసం ఉంచారు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పలువురు తమకు నచ్చిన వస్తువులను తీసుకువెళ్లారు. చిన్న వయస్సు నుంచే ‘ఆర్ట్ ఆఫ్ గివింగ్’ను ప్రోత్సాహించడమే ఈ మిషన్ లక్ష్యమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ప్రధానిదే..

కుత్బుల్లాపూర్: మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందని కేకేఎం ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నేత కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించిన నేపథ్యంలో ఆదివారం కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపేందుకు తరలివెళ్లారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి చేపట్టిన ఈ ర్యాలీని శ్రీనివాస్‌గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు.

ఏబీవైఎం జగద్గిరిగుట్ట అధ్యక్షుడిగా ఆంజనేయులు

జగద్గిరిగుట్ట: అఖిల భారత యాదవ మహాసభ (ఏబీవైఎం) జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షుడిగా గొల్ల ఆంజనేయులుయాదవ్ నియమితులయ్యారు. ఆదివారం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు దూదిమెట్ల సోమేశ్‌యాదవ్ ఉత్తర్వులు జారీ చేయగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూదిమెట్ల సోమేశ్‌యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. అదే విధంగా డివిజన్ ప్రధాన కార్యదర్శిగా రవికుమార్‌యాదవ్‌ను నియమించారు. యాదవుల అభ్యున్నతికి పాటు పడాలని, రాజకీయంగా, సామాజికంగా నిలదొక్కుకునేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సింహయాదవ్, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ప్రారంభం

జీడిమెట్ల: సీసీ కెమరాలు నేరాల నియంత్రణలో ఎంతగానో ఉపయోగపడతాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. చింతల్‌లోని శ్రీనివాస్‌నగర్‌లో కాలనీ వారు ఏర్పాటు చేసిన 24సీసీ కెమెరాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ... ప్రతి కాలనీలో అసోషియేషన్ వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్, కాలనీ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కింద పడి కార్మికుడు మృతి

కుత్బుల్లాపూర్: శ్లాబ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిన ఓ కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన దీపక్ కుమార్ గుండ్లపోచంపల్లిలోని అవిగ్న కన్‌స్ట్రక్షన్స్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 21న మధ్యాహ్నం శ్లాబ్ పనులు చేపడుతుండగా దీపక్ కాలు జారి భవంతి 5వ అంతస్తు నుంచి కిందకు పడ్డాడు. తీవ్ర గాయాలైన అతన్ని స్థానికంగా ఉన్న శ్రీకర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్ కొనివ్వలేదని యువకుడు ఆత్మహత్య

జగద్గిరిగుట్ట: మొబైల్ ఫోన్ కొనివ్వలేదని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట ఎల్లమ్మబండకు చెందిన శ్రీనివాస్‌రాజు కుమారుడు నితీష్(27) ఇంటి వద్దనే ఖాళీగా ఉంటున్నాడు. కాగా ఈ నెల 23న నితీష్ ఫోన్ పాగొట్టుకోవడంతో కొత్తది ఇప్పించాలని తండ్రిని అడిగాడు. ఇప్పుడు అన్ని డబ్బులు లేవు.. వచ్చే నెలలో కొనిస్తానని చెప్పడంతో కోపంతో తన గదిలోకి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చూడగా నితీష్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. అతన్ని కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీతాఫల్.. టేస్ట్‌ఫుల్



షాపూర్ నగర్ ప్రధాన రోడ్డు పక్కన విక్రయానికి ఉంచిన సీతాఫలాలు

సుభాష్‌నగర్: వర్షాకాలం చివరి దశలో ఎక్కడ చూసినా సీతాఫలాలు కనిపిస్తుంటాయి. సీతాఫలాలు చూడగానే ఇష్టపడని వారు ఉండరు. పోషక విలువలు అధికంగా ఉండే ఫలాల్లో సీతాఫలాలు ఒకటని చెప్పుకోవచ్చు. వర్షాకాలం చివరి దశ శీతాకాలం ప్రారంభంలో దొరికే ఈ పళ్లను తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. వీటివల్ల మనకు ఎన్నో పోషకాలను అందిస్తుంది.



సీతాఫలాలను తీసుకెళ్తూ..

ఇక చెట్టుపైనే మొక్కిన సీతఫలాలు తింటే ఆ రుచే వేరు. తింటున్న కొద్దిగా తినాలనిపిస్తుంది. సీజనల్ పండ్లలో సీతాఫలానికి ఆరోగ్యానికి మేలు చేసే అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. ఈ పనులను ఇలా తినగానే అలా శక్తి మన శరీరానికి అందుతుందనీ పోషక ఆహార నిపుణులు చెబుతున్నారు.

సీతాఫలంలో లభించేవి...

కస్టర్డ్ యాపిల్ అని పిలిచే ఈ సీతాఫలాల్లో ఐరన్, ఫాస్ఫరస్, మెగ్నీషియన్ తోపాటు సి విటమిన్, వి6 విటమిన్, వి3 విటమిన్ సమద్ధిగా లభిస్తుంది. 100 గ్రాముల సీతాఫలంలో 1.6 గ్రాముల కొవ్వు, 26.2 గ్రాముల కార్బోహైడ్రేట్, 2.4 గ్రాముల పీచు పదార్థాలు దొరుకుతాయి.

ఆరోగ్యానికి లాభాలు..

సీతాఫలాలు తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉండడానికి దోహదపడుతుంది. కుండే ఆరోగ్యంగా ఉంచడానికి, క్యాన్సర్ నివారణకు ఈ ఫలం చాలా ఉపయోగపడుతుంది. వీటిని తినడం వల్ల అలసట తొలుగుతుంది.



సీతాఫలాలను కొనుగోలు చేస్తూ..

కంటి చూపు మెరుగు కు, ఒత్తిడిని తగ్గించడానికి, చర్మ సౌందర్యానికి, జుట్టు ధృఢత్వానికి దోహదపడుతుంది.

అమ్మకాలు...

వారం రోజుల నుంచి షాపుర్‌నగర్‌లోని ప్రధాన రోడ్డు ఇరువైపులా సీతాఫలాలను పెద్ద ఎత్తున విక్రయిస్తున్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్, శివంపేట్, గుమ్మడిదల, కొడిపల్లి, వెల్దుర్తి ప్రాంతాల నుండి గిరిజనులు అడివిలో ఉండే సీతాఫలాలు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పండ్లు రూ.160 డజన్‌గా విక్రయిస్తున్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యం

• ఎమ్మెల్యే వివేకానంద్



దూలపల్లిలో పీఏసీఎస్ నూతన కార్యాలయన్ని ప్రారంబిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రాజు తదితరులు

కుత్బుల్లాపూర్: రైతులకు జీవనాధారమైన వ్యసాయం సజావుగా కొనసాగించడానికి పీఏసీఎస్ లదే ముఖ్య భూమిక అని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ బ్రాంచ్ కార్యాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులను వ్యవసాయ పరమైన రుణాలు అందజేసేందుకు సహకార సంఘాల ద్వారా తోడ్పాటునందిస్తోందని అన్నారు. సహకార సంఘాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేస్తూ వాటి అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ గరిసె నరేందర్ రాజు, పీఏసీఎస్ మేనేజర్ కృష్ణ, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ రవీందర్‌యాదవ్, బీఆర్ఎస్ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ హన్మంత్‌రావు, పీఏసీఎస్ డైరెక్టర్లు సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌యాదవ్, మల్లేష్, కృష్ణయాదవ్, నరేందర్, శ్రీనివాస్ యాదవ్, నాగమణి, సావిత్రి, మాధవ్, సత్యనారాయణ, వైస్ చైర్మన్ రంగనాయక్, యాదగిరి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ జీడిమెట్ల డివిజన్ శ్రీనివాస్‌నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానికంగా భద్రతతో పాటు దొంగతనాలు నివారణ సీసీ కెమెరాలు దోహదపడతాయన్నారు. జీడిమెట్ల సీఐ పవన్, బీఆర్ఎస్ నాయకులు కుంట సిద్ధిరాములు, సుధాకర్‌గౌడ్, కాలనీ సెక్రటరీ యేశాగౌడ్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

◆ ప్రగతియాత్రలో భాగంగా కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి మల్లికార్జున్‌నగర్‌లో మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్ గారితో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం ఎమ్మెల్యేకు మద్దుతు తెలుపుతూ వచ్చే ఎన్నికల్లో గెలిపించుకుంటామని ఏకగ్రీవ తీర్మానం చేసి పత్రాన్ని అందజేశారు. డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు నార్లకంటి బాలయ్య, సురేందర్ రెడ్డి, రమణ రెడ్డి, అజయ్, వెంకటేష్, నజీర్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

త్వరలో రిజర్వాయర్‌కు మరమ్మతులు

• జీఎం శ్రీధర్‌రెడ్డి

చింతల్: సంవత్సర కాలంగా శిథిలావస్థకు చేరిన రిజర్వాయర్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. అనేక బస్తీలు, కాలనీలకు తాగునీటిని అందించే రిజర్వాయర్ శిథిలావస్థకు చేరి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. షాపూర్‌నగర్ సబ్ డివిజన్ ఆవరణలో ఉన్న (900 కె ఎల్ జి.ఎల్.ఎస్.ఆర్.) రిజర్వాయర్ పైకప్పు శిథిలావస్థకు చేరింది. దీంతో చిన్నపాటి గాలి వచ్చిన పైకప్పుకు ఉన్న రేకులు రిజర్వాయర్ ట్యాంక్‌లో పడి పేరుకు పోతున్నాయి. ఈ నీటి ద్వారానే వివిధ కాలనీలు, బస్తీల ప్రజలకు తాగునీటి నీటిని సరఫరా చేస్తున్నారు.

◆ గతంలో వచ్చిన పెనుగాలులకు ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ పైకప్పు కాస్త కుంగి ట్యాంక్‌లోకి ఎప్పుడు కోలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ పైకప్పు వేసి సుమారు 20 సంవత్సరాలు కావస్తుండడంతో తుప్పు పట్టిపోయింది. దీనికి అంచనాలు రూపొందించాలని జలమండలి జీఎం పలుమార్లు ఆదేశాలు జారీ చేసిన అధికారుల పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

జీఎం ఆదేశాలు బేఖాతర్..

శిథిలావస్థకు చేరిన 900 కేఎల్‌జిఎల్ఎస్ఆర్ రిజర్వాయర్‌కు నూతన పైకప్పు వేసేందుకు జీఎం శ్రీధర్ రెడ్డి ఇప్పటికే సబ్ డివిజన్ కార్యాలయంలో ఉన్న డీజీఎంకు, సెక్షన్ మేనేజర్లకు ఆదేశాలు ఇచ్చినా ఇప్పటి వరకు అంచనాలు రూపొందించడం లేదు.



కుంగిపోయిన రిజర్వాయర్ పైకప్పును పరిశీలిస్తున్న జీఎం శ్రీధర్ రెడ్డి, డీజీఎం అప్పలనాయుడు

రెండు నెలలుగా ఈ విషయమై అధికారులు మీనమేషాలు లెక్కించడం వారి పనితనానికి నిదర్శనంగా నిలుస్తోంది. కొత్త కనెక్షన్లపై చూపించే శ్రద్ధ రిజర్వాయర్ పైకప్పు విషయంలో చూపించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రంగంలోకి దిగిన జీఎం శ్రీధర్‌రెడ్డి..

మేక ప్రజానీకానికి తాగునీటిని అందించే షాపూర్‌నగర్ 900 కేఎల్‌జీఎస్ఆర్ రిజర్వాయర్లకు జీఎం శ్రీధర్‌రెడ్డి రంగంలోకి దిగారు. ఇటీవల జీఎం శ్రీధర్ రెడ్డి, షాపూర్‌నగర్‌లోని రిజర్వాయర్ వద్దకు చేరుకుని రిజర్వాయర్ చుట్టూ కొలతలు తీసుకొని ఒక కాంట్రాక్టర్‌కు అంచనాల రూపొందించమని ఆదేశించారు. అంచనాల రూపొందించగానే టెండర్లు రూపొందించి రిజర్వాయర్‌కు మరమ్మతులతో పాటు నూతన పైకప్పు వేస్తామని ‘సాక్షి’కి తెలిపారు.

ఆయుర్వేదం అతి ప్రాచీన వైద్యం

దుండిగల్: ఆయుర్వేదం అతి ప్రాచీన వైద్యమని, ఈ చికిత్స ద్వారా ఎలాంటి రోగాలైనా నయం చేయవచ్చునని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి అన్నారు. ఆదివారం దుండిగల్ మున్సిపాలిటీ భౌరంపేట్‌లో డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సువర్ణ ప్రాశన ఆయుర్వేద శిబిరాన్ని ఆయన సందర్శించి చిన్నారులకు సువర్ణ ప్రాశన మందును అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ఎన్నో వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చినప్పటికి ఆయుర్వేదం ప్రాధాన్యత తగ్గలేదన్నారు. ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా రోగాన్ని నయం చేయగలిగే శక్తి ఒక్క ఆయుర్వేదానికే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విగ్నేష్, మల్లేష్ యాదవ్, పిసరి కృష్ణారెడ్డి, గోన మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భౌరంపేట్‌లో చిన్నారులకు సువర్ణ ప్రాశన మందును ఇస్తున్న బీజేపీ నేత మల్లారెడ్డి

జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తాం

కుత్బుల్లాపూర్: జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ద్వితీయ మహాసభలు ఆదివారం సురారం బాబుజగ్జీవన్‌రామ్ అంబేద్కర్ భవనంలో జరిగగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ... జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వైద్య సదుపాయం, మెరుగైన వేతన సవరణల కోసం ఫెడరేషన్ యూనియన్ పోరాడుతుందన్నారు. మారుతున్న సమాజంలో జర్నలిస్టులు వృత్తి పరమైన అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని అన్నారు. వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో ఫెడరేషన్ యూనియన్ పనిచేస్తుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి కళ్యాణ్ చక్రవర్తిలు, ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి ఆనందం, జాతీయ కౌన్సిల్ సభ్యుడు వై రామారావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.



◆ అనంతరం కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డమీది అశోక్, ఉపాధ్యక్షులుగా నవతెలంగాణ రమేష్, మంజుల, నర్సింగరావు, ప్రధాన కార్యదర్శిగా విశాలాంధ్ర శంకర్, సంస్థాగత కార్యదర్శిగా శానార్తి తెలంగాణ శివ, కార్యదర్శులుగా అంజీగౌడ్, రాజేశ్వర్, దీపక్, బాల్ రాజు, మోహన్, కోశాధికారిగా అంగూరు గోవింద రావు, ప్రచార కార్యదర్శిగా కొండా సంజీవ్ కుమార్‌లతో పాటు పది మంది కార్యవర్గ సభ్యులను సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శ్రీగణనాథం భజామ్యహం

గణేశ్ మండపాల వద్ద ఆదివారం గణపతులకు విశేష పూజలు నిర్వహించి నిమజ్జనాలకు తరలించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానాలు ఏర్పాటు చేశారు. అనంతరం డప్పు చప్పుళ్ల మధ్య వినాయక విగ్రహాలను నిమజ్జనాలకు ఊరేగింపుగా తరలించారు. – కుత్బుల్లాపూర్



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నెలకొల్పిన గణనాథుడి వద్ద పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



పద్మానగర్ ఫేజ్-1లో గణేశ్ వద్ద భక్తులు



అయోధ్యనగర్‌లో నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేత కె.ఎం.ప్రతాప్



గణేశ్ ఉత్సవాల్లో పాల్గొన్న టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి



నిజాంపేట్‌లో గణనాథుడి వద్ద పూజల్లో బీఆర్ఎస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి



నిజాంపేట్ వెంకటరాయనగర్ కాలనీలోని ఎస్ఆర్ అవెన్యూ అపార్ట్‌మెంట్‌లో..



వినాయకుడి పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

నిమజ్జన శోభ..

సుభాష్‌నగర్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గణనాథులను నెలకొల్పి ఏడు రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం పెద్ద ఎత్తున విగ్రహాలను నిమజ్జనం చేశారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలోని వెన్నెలగడ్డ ఎర్రా చెరువు, సూరారంలోని లింగా చెరువు, గాజులరామారంలోని పరికి చెరువు ప్రాంతాలు నిమజ్జనానికి వచ్చిన భక్తులతో కిటకిటలాడాయి.



వెన్నెలగడ్డలోని ఎర్రా చెరువు వద్ద భక్తుల రద్దీ









గాజులరామారం గ్రామంలో గణపతి లడ్డూ వేలం పాటలో రూ.1.95లక్షలకు లడ్డూ దక్కించుకున్న సుమంత్‌గౌడ్



జాగృతి అపార్ట్‌మెంట్ గణేశ్ వద్ద భక్తులు



గాజులరామారంలో గణేశ్ నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న స్థానిక నాయకులు, భక్తులు